RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 298 | సంపుటి 4 | శనివారం | 01-08-2026 | పేజీలు 4 | వెల 3/-




# ఖరీఫ్ 'రబీ' ధాన్యం మింగేసిన రాబందులు!



- రైస్ మిల్లుల్లో వేల క్వింటాళ్ల ధాన్యం మాయం..?
- దోచుకో.. దాచుకో.. మాకింత ఇచ్చుకో' అంటూ సంబంధిత అధికారుల దందా
- డీఎం, డీఎస్ఓల కనుసన్నల్లోనే కోట్ల రూపాయల దందా
- కంటితుడుపు తనిఖీలతో కాలయాపన చేస్తున్న విజిలెన్స్ అధికారులు

హైదరాబాద్ జూలై 31 (ప్రభాత గమనం):

రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేరిస్తే... అక్కడ కోట్లాది రూపాయల ధాన్యం మాయమైపోతోంది. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, గూడూరు, కొత్తగూడ, మరిపెడ, డోర్నకల్, నెల్లికుదురు, ఇనుగుర్తి, కురవి మండలాలలో 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లలో కొన్ని వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులలో నిల్వ లేదని తెలుస్తుంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వల్లో భారీగా గోల్ మాల్ జరిగిందని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం నమ్మి ఇచ్చిన ధాన్యాన్ని రాత్రికి రాత్రే బహిరంగ మార్కెట్ లలో విక్రయించుకున్న దొంగ మిల్లర్లకు, పౌరసరఫరాల శాఖ లోని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు అండదండలు అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "మీకేం భయం లేదు.. దర్జాగా అమ్ముకోండి, మా వాటా మాకిస్తే చాలు" అంటూ సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 'సిఎంఆర్' రూపంలో ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. కానీ, దొంగ మిల్లర్లు పౌరసరఫరాల అధికారులతో ముందస్తు ఒప్పందాలు చేసుకుని ధాన్యాన్ని మిల్లుల్లో లేకుండానే విక్రయించేశారు. ప్రభుత్వ ధాన్యాన్ని, బియ్యాన్ని అధిక ధరలకు ప్రైవేటు వ్యాపారులకు, ప క్క రాష్ట్రాలకు తరలించి కోట్లు గడిస్తున్నారు.డీఎం, డీఎస్ఓ స్థాయి అధికారులు ఈ అక్రమాలను అడ్డుకోవాల్సింది పోయి, 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందంగా ప్రతి బస్తాపై కమీషన్లు పుచ్చుకుంటూ జేబులు నింపుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మిల్లర్లకు ముందస్తు సమాచారం ఇచ్చి మరీ 'నామ్ కే వాస్తే' తనిఖీలు నిర్వహిస్తూ అంతా పక్కాగా ఉందంటూ నివేదికలు పంపుతుండటం గమనార్హం.2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి రికార్డుల్లో వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు ఉన్నట్లు చూపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మిల్లుల్లో చూ స్తే సగం నిల్వలు కూడా కనిపించడం లేదు. ఫిజికల్ వెరిఫికేషన్ చేయాల్సిన అధికారులు ఎయిర్ కండిషన్డ్ గదులకే పరిమితమై, మిల్లర్లు పంపిన లెక్కలకే ఓకే చెప్పేస్తున్నారు.బాహాటంగానే వినిపిస్తున్న అధికారుల హామీలు! విజిల్ బ్లోయర్లు, స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం.ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది. రైతుల కష్టాన్ని, ప్రభుత్వ సొమ్మును మిల్లర్లు-అధికారుల సిండికేట్ బకాసురుడిలా మింగేస్తోంది.నిబంధనల ప్రకారం గడువులోగా సీఎం ఆర్ ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలి, రికవరీ నోటీసులు ఇవ్వాలి. కానీ, అధికారులు ఆ ఫైళ్లను తొక్కేస్తూ మిల్లర్లకు కాలయాపన చేసే వెసులుబాటు కల్పిస్తు న్నారు. ధాన్యం లేకపోయినా, పాత సంచులను, వేరే వారి ధాన్యం గోదాంలను మళ్లీ మళ్లీ చూపిస్తూ తనిఖీ అధికారుల కళ్లకు గంతలు కడుతున్నారు. జిల్లా స్థాయిలో డీఎం, డీఎస్ఓల పాత్రపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగాలు తక్షణమే రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. అన్ని మిల్లుల్లోనూ అకస్మాత్తుగా థర్డ్ పార్టీ అధికారులతో భౌతిక తనిఖీలు నిర్వహిస్తే కానీ ఈ 2025-26 రబీ, ఖరీఫ్ ధాన్యం మాయం గుట్టు రట్టు కాదు. బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి, దొంగ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.





- ఉద్యమ యోధుడికి అశ్రునివాళి
- వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు, ప్రజలు
- జనసంద్రమైన వరంగల్-నర్సంపేట రహదారి
- ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో పెద్ది ముద్ర
- ఉద్యమంలో అవయవాలు దెబ్బతిన్నా వెనుదిరగని పోరాట యోధుడు
- కేసీఆర్‌కు అత్యంత ఆప్తుడిగా సేవలందించిన ఉద్యమ సహచరుడు
- తెలంగాణ వచ్చేవరకు పెళ్లి చేసుకోనని మాట నిలబెట్టుకున్న అరుదైన నాయకుడు
- పెద్ది జీవిత ప్రస్థానానికి భావోద్వేగ వీడ్కోలు
- నల్లబెల్లిలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

# పెద్దికి కన్నీటి వీడ్కోలు

**వరంగల్, ప్రభాత గమనం, జూలై 31 :**

తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, రాష్ట్ర సాధన సమయాన ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు.. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేక పోతున్నారు. 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి గ్రామంలో జన్మించారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో హనుమకొండలోని రోహిణి హాస్పిటల్‌లో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున 12.51 గంటలకు కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తోపాటు యావత్ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నల్లబెల్లి మండలం నుంచి జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందిన సుదర్శన్ రెడ్డి కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ వెంటే నడిచారు 2001లో టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్) తరఫున జెడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004లో పార్టీ జిల్లా కన్వీనర్‌గా ఎన్నికై ఆ తర్వాత 2002లో రాష్ట్ర కన్వీనర్‌గా నామినేట్ అయ్యారు. ఎనిమిదేళ్లకు పైగా టీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించి, ఆ తర్వాత పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నామినేట్ అయ్యారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఏపీలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆరఎస్ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను పెద్ది సుదర్శన్ రెడ్డికే కేసీఆర్ అప్పగించేవారు. ఎల్కతుర్తిలో జరిగిన పార్టీ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది. అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యమనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి పాకాల సరస్సు నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.

**నర్సంపేటకు భౌతిక కాయం.. భారీగా జనం.. 2కి.మీ మేర ట్రాఫిక్ జామ్**

సుదర్శన్ రెడ్డి భౌతిక కాయం నర్సంపేటకు చేరుకుంది. ఆయన భౌతికకాయాన్ని సందర్శించేందుకు ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడిని చివరిసారిగా చూసి పలువురు భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. మా నాయకుడు ఇక లేరు అంటూ విలపించారు. పార్థివ దేహం నర్సంపేటకు చేరుకున్నప్పటి నుంచి పట్టణంలోని వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు తమ అభిమాన నాయకుడికి కడసారి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. అంతిమయాత్ర సందర్భంగా ప్రధాన రహదారులపై 2 కి.మీ మేర ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## పదవీవిరమణ పోలీసు అధికారులకు సీపీ సన్మానం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను పోలీస్ కమిషనర్ శ్వేత ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు అలీం హుస్సేన్, సీతారాములు, ఏఆర్ ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ నర్సింగంలకు శాలువాలు కప్పి జ్ఞాపికలను అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ, పోలీసు అధికారులు తమ విధుల్లో విజయవంతంగా రాణించడానికి వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగం అనేది త్యాగాలు, క్రమశిక్షణ, అంకితభావానికి ప్రతీక అని, ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన ఈ అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గతంలో పోలీసు అధికారులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారని, వారి కృషి ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొని అభివృద్ధి దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందని తెలిపారు. పదవీ విరమణ అనంతరం అధికారులు కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడపడంతో పాటు తమకు ఇష్టమైన ఏదైనా వ్యాపకాన్ని ఎంచుకుని సంతోషకరమైన జీవితం గడపాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఆర్ఐ సతీష్, ఆర్ఎస్ఐ శ్రవణ్, పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా హెచ్‌ఎం పదవీ విరమణ

- విద్యార్థుల కోలాటాల ప్రదర్శనలతో సందడి
- కంటిపాపలా చూసుకున్న గురువుగారికి విద్యార్థుల కన్నీటి వీడ్కోలు

**గార్ల, జూలై 31 (ప్రభాత గమనం):**

"ఉద్యోగానికి మాత్రమే పదవీ విరమణ ఉంటుంది కానీ, మనుషులకు, మనస్సులకు కాదు... భౌతికంగా నేను ఇక్కడి నుంచి వెళ్తున్నా, నా మనసంతా ఎప్పుడూ ఇక్కడే, నా విద్యార్థుల మధ్యే ఉంటుంది" అని పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులిగండ్ల సురేష్ బాబు భావోద్వేగంతో అన్నారు. శుక్రవారం పుల్లూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్‌ఎం సురేష్ బాబు పదవీ విరమణ శోభస్కరంగా, అత్యంత వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు తమ విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో పాఠశాల ఆవరణ అంతటినీ సందడి వాతావరణంగా మార్చేశారు.తన ముగింపు ప్రసంగంలో సురేష్ బాబు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి, బాగా చదివి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బాధ్యతలు ముగిసినంత మాత్రాన అనుబంధం తెగిపోదని, విద్యార్థులకు, పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తలుపు తట్టవచ్చని, తనకు తోచిన సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ... సురేష్ బాబు క్రమశిక్షణకు, అంకితభావానికి మారుపేరని, ఆయన హయాంలో పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందని కొనియాడారు. అనంతరం సురేష్ బాబు దంపతులను ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సిబ్బంది మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## అయోధ్యపురంలో ఫ్రైడే.. డ్రై డే

**మహబూబాబాద్, జూలై.31(ప్రభాత గమనం):**



శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ గూడూరు మండలంలోని అయోధ్య పురంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమమును తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ..జిల్లాలో గల అన్ని ప్రాథమిక కేంద్ర పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి, లార్వాలను తొలగిస్తూ, ఇంటి పరిసరాల్లో గల కూలర్ లలో నీరు,కొబ్బరి చిప్పలు, రోళ్ళు, నీటి తొట్టిలు, నీరు నిల్వ ప్రాంతాలలో దోమలు పుట్టకుండా లార్వాలను తొలగించాలని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని, దోమలు కుట్టకుండా ఇంటి ద్వారలకు, కిటికీలకు, మెష్ డోర్లను అమర్చుకోవాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా తీసుకోవాల్సిందిగా అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా జిల్లాలో గల సూపర్వైజర్లకు, ఏఎన్ఎంలకు,ఆశలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్, సూపర్వైజర్, ఆశాలు పాల్గొన్నారు.

## కలెక్టర్ స్నేహ శబరీష్ ను కలిసిన టీజేఏ కమిటీ

**మహబూబాబాద్, జూలై 31(ప్రభాత గమనం):**



తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా టిజేఏ యూనియన్ జిల్లా అధ్యక్షులు మేకరబోయిన నాగేశ్వర్ యూనియన్ లోని అంశాలపై కలెక్టర్ కు వివరించగా సంబంధిత శాఖ అధికారిని సంప్రదించమని తెలిపారు. అనంతరం జిల్లా సమాచార, ప్రజా సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) రాజేంద్ర ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా డిపిఆర్ఓ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీజేఏ మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని టీజేఏ ఫౌండర్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్ ఆదేశాల ప్రకారం రాష్ట్ర నాయకత్వం జిల్లా కమిటీని ప్రకటించారు. టీజేఏ జిల్లా అధ్యక్షుడిగా మేకరబోయిన నాగేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇండ్ల మహేష్, ఉపాధ్యక్షుడిగా ఎర్ర మురళి, కార్యదర్శిగా గుగులోతు రమేష్, జిల్లా కోశాధికారిగా జక్కుల మురళి, కమిటీ సభ్యులుగా గాడిపల్లి సందీప్, పొన్నబోయిన వెంకన్న, గుగులోతు నరేష్, బూరుగు శ్రీకాంత్ ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం టీజేఏ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ మాట్లాడుతూ తమ ఎన్నికల ప్రక్రియలో సహకరించిన టీజేఏ ఫౌండర్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రమణరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘోరీలకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమ కోసం టీజేఏ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండి జాకీర్ హుస్సేన్, జినుక శేఖర్, మధు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో రైతులకు అధిక లాభాలు

- కలెక్టర్ స్నేహ శబరిష్
- ప్రాజెక్టు వైవిధ్యం కింద పంటపొలాలను పరిశీలన

**మహబూబాబాద్, జులై 31(ప్రభాత గమనం):**

శుక్రవారం కొత్తగూడ మండలంలో పంట మార్పిడి విధానం కార్యక్రమంలో భాగంగా రైతు బానోతు బిచ్చ, బానోతు సుమన్ పొలంలో ప్రాజెక్టు వైవిధ్యం కింద జరుగుతున్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రక్రియ పరిశీలించి లబ్ధిదారులు బంగారి సాంబలక్ష్మి , గట్టి సుగుణ లతో మాట్లాడి గృహాలను వెంటనే నిర్మించుకోవాలని సూచించారు. గాంధీనగర్ లోని గిరిజన బాలికల గురుకులమును పరిశీలించి విద్యార్థిని, విద్యార్థుల యొక్క విద్యాసామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు, అనంతరం వారితో మాట్లాడి వారి యొక్క అభిప్రాయాలను భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో ప్రాజెక్టు వైవిధ్యం ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట మార్పిడి విధానం ద్వారా రైతులు బానోతు బిచ్చ, బానోతు సుమన్, పంట పొలంలో పెసర్లు, విత్తనాలు చల్లుతున్న రైతులతో స్వయంగా మాట్లాడుతూ..రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు కలగకుండా వరి, మక్కజొన్న, పత్తి, మిర్చి, లే కాకుండా ఇతర పంటలు ఆయిల్ పామ్ , కందులు, పెసర్లు, వేరుశనగ, లెమన్ గ్రాస్, తదితర లాభదాయకమైనటువంటి పంటలు వేయుటకు కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, రైతులు ప్రతి ఒక్కరూ పంట మార్పిడి విధానం ద్వారా కూరగాయలు, పూలు, పండ్ల, పంటలు, సాగు చేయాలని అందుకోసం




అధిక మార్కెట్ ఉంటుందని తెలిపారు. అలాగే ప్రతి రైతు తమ పొలంలో పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా భూగర్భ జలాలు అధికంగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు.ఈ పథకం అమలు కోసం వివిజి రామ్ పథకం ద్వారా సబ్సిడీ అందించడం జరుగుతుందని రైతులకు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతున్న ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు లబ్ధిదారులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా స్వయం సహాయక బృందాల చేత ఆర్థిక సహాయం అందించాలని, ఇప్పటికే ప్రైవేటు సంస్థ ద్వారా గృహాల నిర్మాణం కోసం ఒప్పందాలకు విరుచుకొని నిర్మాణాలు కొనసాగుతున్నాయని, మంజురాయి వివిధ దశలో ఉన్న డబ్బులను వెంటనే అందరికీ ఇవ్వాలని, అర్హులైన వారికి పక్కా గృహాలను నిర్మించి ఇవ్వాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అట్టి పథకాన్ని కచ్చితంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. అనంతరం గిరిజన గురుకుల, పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థిని ,విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి వివరాలు ఆశయాలను అభిప్రాయాలను అడిగి తెలుసుకుని భవిష్యత్తు ప్రణాళికలు ద్వారా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాలతో ఇంగ్లీష్ తో పాటు అన్ని సబ్జెక్టులలో ప్రావీణ్యత సాధించే విధంగా తరగతులు నిర్వహించాలని, పక్క డైట్ మెలో ప్రకారం కచ్చితంగా బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ స్నాక్స్ అందించాలని పిల్లలకు అదే విధంగా చర్యలు తీసుకోవాలని, సూచించారు. మండల కేంద్రంలో ప్రభుత్వం చే నిర్వహించబడుతున్న మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు రికార్డుల ప్రకారం యూరియా యాప్ ద్వారా బుక్ చేయాలని, ఈపాస్ మిషన్ ద్వారా నే ఎరువులు ఇవ్వాలని, ప్రతి రైతుకు బిల్లులు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. స్టాక్ ను స్వయంగా తనిఖీ చేశారు, అక్రమంగా యూరియా ,డిఏపి, నన్ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, ఏ డి ఏ శ్రీనివాసరావు, అని విభాగాల సంబంధిత అధికారులు, తహసిల్దార్ రాజు, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.




## కామ్రేడ్ లింగన్న ఆశయ సాధనకు
# పునరంకితమవుదాం

- పోడు భూములు, గిరిజన హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన యోధుడు
- లింగన్న స్తూపానికి ప్రభుత్వం వెంటనే అనుమతినివ్వాలి
- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్
- లింగన్నకు ఘనంగా నివాళులర్పించిన నాయకులు

**గార్ల, జులై 31 ( ప్రభాత గమనం):**

గిరిజనుల హక్కులు, పోడు భూముల రక్షణ మరియు కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా చివరి శ్వాస వరకు పోరాడిన ఆదివాసీ ముద్దుబిడ్డ, సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ మాజీ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ పూనెం లింగన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు.సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం కామ్రేడ్ లింగన్న 7వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవాంజలి ఘటించారు.ఈ సందర్భంగా గౌని ఐలయ్య మాట్లాడుతూ... భూమి, భుక్తి, ముక్తి కోసం నాడు యుక్తవయసులోనే లింగన్న పోరాట బాట పట్టారని గుర్తుచేశారు. కూడు, గూడు, నీడ లేని నిరుపేదలను ఏకం చేసి హక్కుల కోసం పోరాడేలా చైతన్యపరిచారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు భూముల రక్షణ, తునికాకు రేట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల సాధనకై గిరిజనులను ముందుండి నడిపించిన మహోన్నత నాయకుడని కొనియాడారు.గుండాల ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను దోచుకోవాలని చూసిన కార్పొరేట్ శక్తులకు లింగన్న పోరాటాలు అడ్డుగోడగా నిలిచాయని ఐలయ్య ఆరోపించారు. లింగన్న జీవించి ఉంటే తమ దోపిడీ సాగదని భావించిన స్వార్థ శక్తులు, ప్రభుత్వాలు కుట్ర పన్ని రాత్రికి రాత్రే పోలీసు బలగాలతో ఆయనను బూటకపు ఎన్‌కౌంటర్‌లో పొట్టనబెట్టుకున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఆయన భౌతికంగా దూరమైనా, ప్రజల గుండెల్లో నిత్యం ఎగిరే పోరాట జెండాగా నిలిచిపోయారని, ఆయన త్యాగం హిమాలయమంత గొప్పదని పేర్కొన్నారు.సొంత కన్నతల్లికి చెందిన పట్టా భూమిలో లింగన్న స్మారక స్థూపాన్ని నిర్మిస్తే, అధికారులు దాన్ని కూల్చివేయడం హేయమైన చర్య అని గౌని ఐలయ్య మండిపడ్డారు. ఇప్పటివరకు స్థూప నిర్మాణానికి పాలకుల నుంచి, అధికారుల నుంచి అనుమతి లభించకపోవడం వారి నిరంకుశ వైఖరికి అద్దం పడుతోందన్నారు. నాయకుని జ్ఞాపకార్థం స్థూపం కట్టుకోవడానికి కూడా భయపడుతున్నారంటే ఆయన పోరాట పటిమ ఎంతటిదో అర్థమవుతోందన్నారు. అధికారులు వెంటనే లింగన్న స్థూప నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌని భద్రయ్య, గౌని మల్లేశం, శ్రీరాములు, వెంకన్న, వెంకటేశ్వర్లు, బోలీషా, శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య,వైద్యం కోసం
# పోరాటాలకు సిద్ధం కావాలి

- - సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి

**డోర్నకల్ జులై 31(ప్రభాత గమనం):**




నాణ్యమైన విద్య,వైద్యం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.డోర్నకల్ మండల కేంద్రం అశోక్ భవన్ లో జరిగిన సిపిఐ సమావేశంలో సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్యాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం వలన పేద, మధ్యతరగతి ప్రజలు తమ ఆదాయంలో అధిక శాతం ప్రైవేట్ సంస్థలకు ధారపోసి మరింత పేదలుగా మారుతున్నందున, నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రజలకు అందించడం ప్రభుత్వాల ప్రాథమిక విధి, దీని అమలు కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో బలమైన ప్రజా పోరాటాలు నిర్మించాలని కోరారు. 12 ఏళ్లుగా పాలన గావిస్తున్న బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమై, ప్రజా ఉద్యమాలను పోలీసు బలగాలతో అణిచివేయాలనే నిరంకుశ విధానాలపై ప్రజాస్వామిక వాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 6 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా సిపిఐ కొనసాగించే పాదయాత్రల జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, మండల కన్వీనర్ తురక రమేష్, పట్టణ కార్యదర్శి ఎల్లావుల నరసింహారావు, కె ప్రబెష్, జన్నె స్వామి, రావూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ సంగీత కుటుంబానికి
# రూ.15 లక్షల చెక్కు అందజేత

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మృతి చెందిన పోలీస్ మహిళ కానిస్టేబుల్ సంగీత కుటుంబ సభ్యులకు బ్యాంక్ ఆఫ్ బరోడా పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద మంజూరైన రూ.15 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మరియు బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కానిస్టేబుల్ సంగీత అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి పథకాలు ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు మరియు కానిస్టేబుల్ సంగీత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






## గోదావరి వరదలపై ప్రజలు
# అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద నీటి ప్రవాహం వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం మూడో ప్రమాద హెచ్చరిక కి చేరుకున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్ పి సూచించారు. ముఖ్యంగా గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు, బ్యాక్‌వాటర్ ప్రభావిత గ్రామాల ప్రజలు పరిస్థితులను నిరంతరం గమనిస్తూ పోలీసు, రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఏటూరునాగారం, వాజేడు, మంగపేట పేరూరు కన్నాయిగూడెం వెంకటాపురం మండలాల్లోని గోదావరి నది పరివాహక ప్రాంతాలు, బ్యాక్‌వాటర్ ప్రభావిత గ్రామాల ప్రజలు ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని ఎస్పీ సూచించారు. అవసరమైతే అధికారులు సూచించే సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలివెళ్లాలని తెలిపారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లరాదని, వరద ఉధృతి కొనసాగుతున్న సమయంలో నదిలోకి దిగడం, పడవల ద్వారా ప్రయాణించడం, సాహసాలకు పాల్పడడం ప్రాణాపాయమని హెచ్చరించారు. అలాగే గోదావరి ఒడ్డున నివసించే ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు చిన్నారులను నది వద్దకు వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని సూచించారు. జిల్లా పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసు అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఎస్ పి తెలిపారు.

### జంపన్నవాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు

ములుగు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జంపన్నవాగులో ప్రమాదవశాత్తు గల్లంతైన వ్యక్తి కోసం పోలీసు, ఎస్‌డీఆర్‌ఎఫ్ జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బుధవారం జంపన్నవాగు ప్రధాన వంతెన నుంచి ఊరట్టం వంతెన మధ్య ప్రాంతంలో తన స్నేహితులతో కలిసి మద్యం మత్తులో నీటిలో ఈతకు దిగిన ఘట్‌కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పీట్ల తిమ్మయ్య (45) ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఈ ఘటనపై ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ సంఘటన స్థలాన్ని సందర్శించి గాలింపు చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, పస్రా సీఐ దయాకర్ లతో కలిసి సంఘటన స్థలాన్ని ఎస్ పి పరిశీలించారు. జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కు చెందిన ఇద్దరు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, 25 మంది శిక్షణ పొందిన నిపుణులైన సిబ్బంది ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయంగా జంపన్నవాగులో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు



# వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- కుటుంబానికి సమయాన్ని కేటాయించాలి
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,


**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు కర్తవ్యనిబద్ధతతో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, రిటైర్డ్ అధికారులను అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అత్యంత బాధ్యతాయుతమైనదని, కుటుంబానికి దూరంగా ఉండి ప్రజల భద్రత కోసం అంకిత భావంతో సేవలందించడం పోలీస్ సిబ్బంది గొప్పతనమని అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిడులు, సవాళ్లు ఎదురైనా వాటిని సమర్థవంతంగా అధిగమించి సేవలందించిన రిటైర్డ్ అధికారుల సేవలు పోలీస్ శాఖకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని గడుపుతూ ప్రశాంతమైన, ఆనందకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అధికారులకు మరియు వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి వారి విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

## నేటి నుంచి 7 వరకు
# ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

- మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఆరోగ్య కేంద్రాలు, గ్రామాలు, పట్టణాల్లో ఆరోగ్య సిబ్బంది ద్వారా తల్లిపాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. జన్మించిన శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహారం ఇవ్వకూడదని డీఎంహెచ్‌వో సూచించారు. ప్రసవం అనంతరం వచ్చే మొదటి పాలను ముర్రుపాలు (కొలస్ట్రం) అని పిలుస్తారని, ఈ పాలలో ప్రోటీన్లు, విటమిన్-ఎ, విటమిన్-బి, ఐరన్‌తో పాటు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు అధికంగా ఉంటాయని తెలిపారు. ముర్రుపాలు శిశువుకు అమృతంతో సమానమని, జీర్ణ శక్తిని పెంపొందించడంతో పాటు కామెర్లు, విరేచనాలు వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయని పేర్కొన్నారు. తల్లిపాలు శిశువుకు అత్యంత సహజమైన, సురక్షితమైన, పుష్టికరమైన ఆహారమని, తల్లిపాలు తాగే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి రక్షణ కల్పించడమే కాకుండా దవడల అభివృద్ధికి కూడా తల్లిపాలు దోహదపడతాయని వివరించారు. పాలిచ్చే తల్లులకు కూడా తల్లిపాలు ఇవ్వడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, రక్తస్రావం తగ్గడంతో పాటు తల్లీబిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని డాక్టర్ అప్పయ్య తెలిపారు. బిడ్డకు పగలు, రాత్రి కలిపి కనీసం 8 నుంచి 10 సార్లు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు 7 నుంచి 8 నెలల వయస్సులో రోజుకు మూడు సార్లు, 9 నుంచి 11 నెలల వయస్సులో రోజుకు నాలుగు సార్లు పై ఆహారం అందించాలని చెప్పారు. అలాగే బిడ్డకు పాలిచ్చే సమయంలో తల, శరీరం ఒకే వరుసలో ఉండేలా ఒడిలో పట్టుకోవాలని, బిడ్డ నోరు బాగా తెరిచిన తర్వాత చనుమొనను పూర్తిగా నోటిలోకి అందించి రెండు స్తనాల నుంచి పాలు తాగించేలా చూడాలని తల్లులకు డీఎంహెచ్‌వో సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

# మహిళలను వేధిస్తున్న ఎస్సై అరెస్టు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

సోషల్ మీడియా ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారిని నమ్మించి లైంగిక దాడులు, బెదిరింపులు, డబ్బుల కోసం వేధింపులకు పాల్పడిన సబ్ ఇన్‌స్పెక్టర్ కదిరే శ్రీకాంత్‌ను సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలానికి చెందిన కదిరే శ్రీకాంత్ (38) 2014 బ్యాచ్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సోషల్ మీడియా వేదికగా మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారిని నమ్మించి మానసిక, శారీరక వేధింపులకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. 2025లో ఓ మహిళతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పరచుకున్న నిందితుడు, తాను పోలీసు అధికారినని నమ్మబలికి ఆమెతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నాడు. అనంతరం బాధితురాలి వ్యక్తిగత పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఆమెపై పలుమార్లు బలవంతపు లైంగిక దాడులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అలాగే బాధితురాలిని




బెదిరిస్తూ నగ్న చిత్రాలు తన వద్ద ఉన్నాయని చెప్పి, వీడియో కాల్స్ ద్వారా అసభ్యంగా వేధించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు కూడా పాల్పడినట్లు వెల్లడించారు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో అరెస్టు భయంతో నిందితుడు విధులకు హాజరు కాకుండా గోవా, హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో తలదాచుకుని తిరిగాడని, తన మొబైల్ సిమ్ కార్డులను ధ్వంసం చేసి కేవలం వై-ఫై ద్వారా మాత్రమే కమ్యూనికేషన్ కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు. సాంకేతిక ఆధారాలు, విశ్వసనీయ సమాచారంతో నిందితుడి ఆచూకీని గుర్తించిన పోలీసులు నిజామాబాద్‌లో అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోర్టులో హాజరుపరచగా హనుమకొండ జిల్లా మూడో అదనపు న్యాయమూర్తి నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఇదివరకు కూడా హైదరాబాద్‌కు చెందిన మరో యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగికంగా దోపిడీ చేసిన కేసులో జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ మాట్లాడుతూ, మహిళలు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# ఆడబిడ్డల శానిటరీ ప్యాడ్ల సొమ్ము మాయం

- విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులను దారి మళ్లించిన రేవంత్ సర్కార్
- విద్యా మాఫియా కేటుగాళ్లు పల్లా, కొమ్మూరి
- అమెరికా తరహాలో విద్య అందిస్తాం
- కత్తెర గుర్తుతో చరిత్ర మారుస్తాం
- సీతక్క కంటే సీనియర్ మావోయిస్టు మా వనజక్క
- డాకర్ భిక్షపతిని తొలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తీన్మార్ మల్లన్న



**జనగామ, జూలై 31(ప్రభాత గమనం):**

జనగామ జిల్లా కేంద్రంలోనీ జూబ్లీ ఫంక్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం,యూత్ ప్రెసిడెంట్ పిట్టల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ బహుజన విద్యార్థి యువ చైతన్య సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన శైలిలో అధికార, ప్రతిపక్ష పార్టీలపై నిప్పులు చెరిగారు. విద్యార్థుల సమస్యలు, పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, విద్యా వ్యాపారం చేస్తున్న రాజకీయ నాయకుల తీరుపై ఆయన మండిపడ్డారు.

**ఆడబిడ్డల సొమ్ము 74 కోట్లు ఏమైనట్టు?**

గత కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ఆడబిడ్డల కోసం ప్రవేశపెట్టిన శానిటైజేషన్ స్కీమ్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం అటకెక్కించిందని మల్లన్న మండిపడ్డారు. "ఆడబిడ్డల శానిటరీ ప్యాడ్ల కోసం కేటాయించిన రూ.74 కోట్లు దొంగతనంగా ఎత్తుకపోయి తిన్నారని ధ్వజమెత్తారు.

**స్కాలర్‌షిప్ నిధుల దారి మళ్ళింపు**

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందాల్సిన 1900 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ నిధులలో కేవలం 300 కోట్లు మాత్రమే విడుదల చేసి, మిగిలిన సొమ్మును రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇతర పనులకు దారి మళ్లించిందని మల్లన్న ఆరోపించారు. "పోలీసు శాఖలోని ఒక కుక్క ఆహారం కోసం నెలకు 16,000 రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, హాస్టల్‌లో ఉండి చదువుకునే పేద బిడ్డలకు కనీసం 2000 రూపాయలు కూడా ఇవ్వడం లేదు. కుక్కకు ఉన్న విలువ కూడా విద్యార్థులకు లేదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.శ్రీ చైతన్య, నారాయణ వంటి విద్యా సంస్థలు ఇతర రాష్ట్రాల విద్యార్థుల ర్యాంకులను తమవిగా చూపించుకుంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు

**చట్టాల అమలులో విఫలం**

'రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ 2009' ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు దక్కాల్సిన 25% ఉచిత సీట్ల గురించి ప్రభుత్వం ప్రజలకు చెప్పడం లేదని, ఆ చట్టాన్ని అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు.భారతదేశంలో విద్య కోసం అత్యంత తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, దీనివల్ల రాష్ట్ర విద్యా వ్యవస్థ దేశంలోనే 18వ స్థానానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం కార్పొరేట్ కాలేజీల్లో సీట్లు నింపడం కోసమే పదవ తరగతిలో అందరినీ పాస్ చేస్తున్నారని, ఇది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటమేనని ఆయన పేర్కొన్నారు

**రాజకీయ నాయకుల ద్వంద్వ నీతి...**

మాజీ ముఖ్యమంత్రి మనవడు అమెరికాలో చదువుకుంటుంటే, పేద విద్యార్థులు మాత్రం కూలిపోయే స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. జనగామ నియోజకవర్గంలో రాజకీయం విద్యా వ్యాపారవేత్తల చేతుల్లో బందీ అయిందని మల్లన్న విమర్శించారు. ఒకవైపు అనురాగ్ యూనివర్సిటీ యజమాని పల్లా రాజేశ్వర్ రెడ్డి, మరోవైపు కొమ్మూరి ఇన్స్టిట్యూట్ అధినేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి విద్యను అమ్ముకుంటూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని ధ్వజమెత్తారు. "1,26,000 బీసీ ఓట్లున్న జనగామలో కేవలం 11,000 ఓట్లున్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వీళ్ళే ఎందుకు ఏలాలి? ఈ విద్యా వ్యాపారుల నుంచి జనగామను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది" అని ఆయన పిలుపునిచ్చారు.

**తొలి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ భిక్షపతి ప్రకటన**

ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున జనగామ నియోజకవర్గ మొట్టమొదటి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ భిక్షపతిని తీన్మార్ మల్లన్న అధికారికంగా ప్రకటించారు. 20 ఏళ్ల పాటు సైన్యంలో దేశానికి సేవ చేసి వచ్చిన ముదిరాజ్ బిడ్డ భిక్షపతిని గెలిపించుకోవాలని, అప్పుడే జనగామలో పేద బిడ్డలకు ఉచిత విద్య, మెరుగైన భవిష్యత్తు అందుతుందని ఆయన పేర్కొన్నారు.

**ఉచిత విద్యే లక్ష్యం.. కత్తెర గుర్తుతో చరిత్ర మారుద్దాం..!**

అమెరికా వంటి దేశాల్లో 12వ తరగతి వరకు ఉచిత విద్య అందుతోందని, తెలంగాణలో కూడా ప్రతి ప్రైవేట్ కాలేజీలో ఫ్రీ ఎడ్యుకేషన్ అందే వరకు టిఆర్పి పోరాడుతుందని మల్లన్న స్పష్టం చేశారు. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం దక్కాల్సిన 25% ఉచిత సీట్ల గురించి ఏ ప్రభుత్వం మాట్లాడటం లేదని ఆయన విమర్శించారు. మన తలరాతలు మారాలంటే 'కత్తెర' గుర్తుపై ఓటు వేసి రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్థానిక 5 మరియు 13వ వార్డుల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు మల్లన్న గారికి ఘన స్వాగతం పలికారు. ప్రజలను ఉద్దేశించి మల్లన్న మాట్లాడుతూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ,క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్,మహిళా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పుష్ప లీలా,మైనారిటీ అధ్యక్షులు సల్మాన్,యూత్ అధ్యక్షులు చంద్రశేఖర్,కార్యదర్శి ప్రవీణ్ రాజ్,సహాయక కార్యదర్శి గిరగాని బిక్షపతి గౌడ్,యూత్ జనరల్ సెక్రటరీలు వీరమల్లు అనిల్,పోలు రాజు , మహిళా ఉపాధ్యక్షురాలు చేసుకూరి మౌనిక యాదవ్,రాష్ట్ర నాయకులు సుతారపు రంగన్న,స్టేట్ ఆఫీసు కోఆర్డినేటర్ లింగం యాదవ్,సంయుక్త కార్యదర్శి గడ్డం కృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు రేణుగుంట్ల మురళి బైండ్ల మరియు బోడ రమేష్ నేత, మైనారిటీ జిల్లా అధ్యక్షులు యాకుబ్ పాషా, జిల్లా మహిళా అధ్యక్షురాలు దండు రాణి, హన్మకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూజారి సత్యనారాయణ,నియోజక వర్గ ఇంచార్జి సీసా శ్రీధర్ గౌడ్, యూత్ ఉపాధ్యక్షులు యమంకి విజయ్,యూత్ ప్రధాన కార్యదర్శి వంశీ,కార్యదర్శి గంగరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షులు వెంపటి అజయ్, పట్టణ అధ్యక్షులు గుజ్జుక రాజు,పట్టణ యూత్ అధ్యక్షులు పానుగంటి కృష్ణ,యూత్ కార్యదర్శి ఎనగందుల.ఉమేష్, మైనారిటీ పట్టణ అధ్యక్షులు ఎండి పాషా, జలీల్ పాషా, సల్మాన్, భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.



## పీఆర్ ఈఈ సైదుల్ రెడ్డికి ఘనంగా వీడ్కోలు..

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హనుమకొండ జిల్లా పంచాయతీరాజ్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ (ఈఈ) సైదుల్ రెడ్డి శుక్రవారం ప్రభుత్వ సేవల నుంచి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆత్మీయంగా నిర్వహించిన వీడ్కోలు, సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొని ఆయనకు ఘన సన్మానం చేశారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, సైదుల్ రెడ్డి మరియు ఆయన సతీమణి అనసూర్య దంపతులకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలో సైదుల్ రెడ్డి నిబద్ధత, నిజాయితీ, బాధ్యతాయుతమైన పనితీరుతో శాఖ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఆయన చూపిన అంకితభావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సహచరులు సైదుల్ రెడ్డిని ఘనంగా సన్మానించి, ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. భావి జీవితం ఆయురారోగ్యాలు, ఆనందాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు.




## డీఎంహెచ్ఓగా డా. బి.రాజారెడ్డి బాధ్యతల స్వీకరణ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్ఓ) అధికారిగా డా. బి. రాజారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందజేసి, జిల్లాలో వైద్య ఆరోగ్య సేవల పురోగతిపై సంక్షిప్తంగా చర్చించారు. తదుపరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, శాఖాధిపతులు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడమే శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఉద్యోగి సమన్వయంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు డా. బి. రాజారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా. రాజమౌళి, డా. సాజిదా, డా. ఇక్తిదార్ అహ్మద్, డా. అరుణ్ జోషి, డా. అఖిల్, డీఎంఓ రజనీ, సూపరింటెండెంట్ అనిల్ కుమార్, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్న, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, డీపీఎంఓ అనుపమ, డీపీఓ అర్చన, ఫార్మసిస్ట్ సుదర్శన్ గౌడ్, హెచ్ఈఓ సదానందం పాల్గొన్నారు.

## ఎస్ఆర్ యూనివర్సిటీలో మైనర్ విద్యార్థి అదృశ్యం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ యూనివర్సిటీలో చదువుతున్న బీహార్‌కు చెందిన 16 ఏళ్ల మైనర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. విద్యార్థి కనిపించకుండా పోవడంతో హసన్‌పర్తి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్ జిల్లా బిక్రంపూర్ బండే గ్రామానికి చెందిన మహ్మద్ ఎక్రమ్ హుస్సేన్ ఇటీవల ఎస్ఆర్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొంది ఈ నెల 28న హాస్టల్‌లోని గది నంబర్–241లో చేరాడు. అయితే జూలై 29 నుంచి కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో వారు యూనివర్సిటీ వార్డెన్‌ను సంప్రదించారు. విచారణలో విద్యార్థి హాస్టల్ గదిలో లేడని గుర్తించారు. దీంతో విద్యార్థి బావ సాద్ అహ్మద్ హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన విద్యార్థి వయస్సు 16 సంవత్సరాలు. అతడు సుమారు 5 అడుగుల 8 అంగుళాల ఎత్తు, తెల్లని ఛాయ, సన్నని శరీరాకృతితో ఉంటాడని పోలీసులు తెలిపారు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు వెంటనే హసన్‌పర్తి పోలీసులను సంప్రదించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ఇన్‌స్పెక్టర్ 8712685124, ఎస్‌హెచ్‌ఓ 8712685015, ఎస్ఐలు 8712685097, 8712685098 నంబర్లను విడుదల చేశారు. ప్రస్తుతం విద్యార్థి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది.

## జీపీడీపీ ప్రణాళికలు పటిష్టంగా రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




గ్రామ, మండల, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు (జీపీడీపీ, బీపీడీపీ, డీపీడీపీ) 2026–27 ఆర్థిక సంవత్సరానికి సమగ్రంగా, పటిష్టంగా రూపొందించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో ప్రణాళికల రూపకల్పనపై సమగ్రంగా చర్చించారు. గ్రామీణాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల అవసరాలను ప్రతిబింబించేలా అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సర్వ శిక్షా అభియాన్, వ్యవసాయ, సంక్షేమ, వైద్యారోగ్య, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, మత్స్య, అటవీ, పౌర సరఫరాలు, పశుసంవర్ధక, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, విద్య, రెవెన్యూ తదితర శాఖలు తమ 2026–27 కార్యాచరణ ప్రణాళికలు, అమలులో ఉన్న పథకాలు, ప్రతిపాదిత పనులు, అందుబాటులో ఉన్న వనరులు, లబ్ధిదారుల వివరాలు, నిధుల వినియోగ సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేసి జీపీడీపీ ప్రణాళికల్లో పొందుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు గ్రామసభలు, మండల స్థాయి సమావేశాల్లో తప్పనిసరిగా పాల్గొని స్థానిక ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొందించి గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడే కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్వో శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## త్వరలో రోడ్డుపైకి ఆర్టీసీ ఆటోలు..

**తెలంగాణ జులై 31(ప్రభాత గమనం) :**



ఆర్టీసీ త్వరలోనే" ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్ కనెక్టివిటీ "పేరుతో ఎలక్ట్రికల్ ఆటోలను తీసుకురానుంది.. బస్సులతో పాటు ఆటో సేవలు అందించనుంది,, ప్రయాణికులు బస్సు, ఆటో, టికెట్లను ఒకేసారి బుక్ చేసుకోవచ్చు.. ప్రయాణికులను బస్ స్టాప్ కు,, బస్సు దిగిన తర్వాత,, వెళ్లాల్సిన చోటుకు ఆటోలు తీసుకెళ్తాయి.. మొదట జిహెచ్ఎంసి, తర్వాత కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, వంటి నగరాల్లో అందుబాటులోకి రానున్నాయి...

## గౌడన్నలకి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజిని కుమార్ యాదవ్
- కల్లుగీత కార్మిక సంఘం 'బస్సు యాత్ర' వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- ఆగస్టు 2 నుండి 18 వరకు సాగనున్న యాత్రకు టీఆర్పీ సంపూర్ణ మద్దతు



**హన్మకొండ జులై 31(ప్రభాత గమనం):**

తెలంగాణలో గౌడ సామాజిక వర్గానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజిని కుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ నుండి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న 'బస్సు యాత్ర'కు టీఆర్పీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.హన్మకొండ జిల్లాలోని టీఆర్పీ ప్రధాన కార్యాలయంలో జిల్లా కల్లుగీత కార్మిక సంఘం నాయకులతో కలిసి బస్సు యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదం రజిని కుమార్ యాదవ్ మాట్లాడుతూ, బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ వారిని మోసం చేయడంలో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ముందుంటాయని మండిపడ్డారు. ప్రాణాలకు తెగించి ఆకాశమంత ఎత్తులో ఉండే తాటి, ఈత చెట్లెక్కి కల్లు గీసే కార్మికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన గౌడన్నలపై పాలకులు ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ఆయన ప్రశ్నించారు. హక్కుల సాధన కోసం గౌడన్నలంతా ఏకమై, రాష్ట్రంలోని అగ్రవర్ణ పార్టీలకు బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోమల మంజుల గౌడ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలు రాజు ముదిరాజ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బండి రంజిత్ కుమార్ గౌడ్, గడ్డం యాదగిరి గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కోతి సాంబరాజు గౌడ్, మోటపోతుల రాజు గౌడ్, కారంగుల రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'జైల్ భరో'ను జయప్రదం చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపు
- గార్లలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం



**గార్ల, జులై 31 ( ప్రభాత గమనం ):**

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో ఆగస్టు 10న చేపట్టనున్న 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.శుక్రవారం గార్ల మండల కేంద్రంలోని మంగపతి రావు భవనంలో వి.పి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఆయా సంఘాల మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కార్మికుల హక్కులను కాలరాసేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్వరూపాన్ని మారుస్తూ తీసుకొచ్చిన వి.బి.జి. రాంజీ చట్టాన్ని రద్దు చేసి, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను మానుకోవాలి.విద్యుత్ సవరణ చట్టం ద్వారా రైతులపై అదనపు భారం పడుతుందని, ఇది వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.పంటలకు మద్దతు ధర కల్పించకపోగా... ఎరువులు, విత్తనాలు, డీజిల్ ధరలు విపరీతంగా పెంచడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశంలో ఉపాధి కూలీలు, రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీరి హక్కుల పరిరక్షణ కోసమే ఈ పోరాటమని స్పష్టం చేశారు. ఆగస్టు 10న జరగబోయే 'జైల్ భరో'లో రైతులు, కార్మికులు, ఉపాధి కూలీలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, రైతు సంఘం మండల కార్యదర్శి గడ్డిపాటి రాజారావు, నాయకులు మల్లెల నాగమణి, చింత మౌనిక, సిహెచ్. ఎల్లయ్య, టి. రమా, ఎ. రామకృష్ణ, వి. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374